451

# అభ్యుదయము


౧ వ సంపుటము | రాజమహేంద్రవరము | ౧ వ సంచిక

౧౯౪౭ ఆగష్టు


## ఉపక్రమణిక

ఇప్పుడు మన భాషలో పెరుగుతూవున్న పత్రికల సంఖ్యలో ఇంకో కొత్తదాన్ని చేరుస్తున్నాము. ఈ మా అభ్యుదయ సంఘానికి సంజీవిగానూ, వాఙ్మయాని కలంకారంగానూ, వుండేటట్లు నడపడంలో మేము సావధానులంగానే వుంటాము. మాకలాంటిఅవకాశాన్ని కలిగించే భారం దేశీయులమీద వుంది. పత్రికాప్రారంభాన్ని విన్న వెంటనే చేయూత నిచ్చిన వాఙ్మయపోషకు లైన సంపన్నులకూ, సహకారం చూపిన వశ్యవాక్కు లైన విశేఖకులకూ, తమ సరస్వతీ పవర్ ముద్రాశాలలో దీని నచ్చువేయించి యివ్వడాని కంగీకరించిన మాయెడల ప్రత్యేకాభిమానం గల శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామినాయుడుగారికీ హృదయపూర్వకమైన మాకృతజ్ఞత తెలుపుతూ ఈ మొదటిసంచిక నాంధ్రసోదరసోదరీమణుల కరకమలాల్లో వినీత భావంతో సమర్పిస్తున్నాము.

పత్రికాధిపతి

## గూడు మారిన కొత్తరికం

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

నరసమ్మ అదే తొలీమాటు కాపరానికి వెళ్ళడం. వేసవికాలంలో రాజమహేంద్రవరం వేడిమంగలం లాగ వుంటుం దని చెబుతూ పంపడానికి తల్లీదండ్రీకూడా కొంచెం వెనకాడారు గాని చివరికి తప్పింది గాదు. పోనీ తొలకరించాక వెళ్ళకూడదా అంటే వైశాఖబహుళంలో చక్కమూర్తానికి వస్తుంది. మళ్ళీ కార్తీకమాసందాకా వీలుపడదు. అన్నాళ్ళదాకా పూరుకోడానికి మొగుడు వప్పుకోలేదు. పాపం అతనికి రాజమహేంద్రవరంలో వంటపూటింటి భోజనం. అదివర కెలా వున్నా భార్య్య కాపరానికి వచ్చాక — అంటే పునస్సంధానం అయిన తరవాతకూడా పూటకూటింటి భోజనం చెయ్యడం యెమచరే. వెనక్కాల యేమనుకున్నా వుంటే రామారావిప్పు డింత పట్టుపట్టకపోవును. శీతాకాలంలో స్నానానికి కనీన్ని వేన్నీళ్లు కావాలన్నా, వేసవిలో పూసుకోడానికి కనింత మంచిగంధం కావాలన్నా, వర్షాకాలంలో బసలో తాగడానికి తేరిన గోదావరినీళ్ళు కావాలన్నా స్వప్నఫలంగా వున్నా యతనికి. గర్భాధానం అయి సంవత్సరం

అయిన తరవాతగూడా యింకా యేవో వంకలు పెడుతూవుంటే యెలాగా? ఇంతకీ నరసమ్మ చిన్నపిల్ల యేమో అంటే పదహారో యేడు వెళ్ళిందో వెడుతుందో.

తండ్రికి మూడోబిడ్డ అయినా ఆమె తల్లికి యేకసంతానం. ముప్ఫయ్యో యేట కళత్రవియోగం సంభవించగా కల్లూరి సోమసుందరం అప్పటికి పన్నిండేళ్ళు వున్న రాజమ్మని మళ్ళీ పెళ్ళాడాడు. మొదటిభార్యయందతనికిద్దరు కొడుకులు. వారిద్దరూ తలో వుద్యోగంలోనూ పొరుగూళ్ళలో వున్నారు. రాజమ్మకైనా, సోమసుందరానికైనా నరసమ్మే ప్రస్తుతం కూతురుగానూ కొడుకుగానూ వుంది. కొడుకులు దగ్గిర లేకపోవడంచేతనూ, పైగా రెండోపెళ్ళాముద్యేక సంతానం కావడంచేతనూ అతని కామెమీద యెంతో ప్రేమ. పొలాన్నుంచేనా మరెక్కణ్ణుంచేనా యింటికి వచ్చేటప్పటి కామె కనబడకపోతే యెలాగో మండుతున్నవాడులా వుంటాడతను.

అయితే మాత్రం ఆడపిల్ల అయినాక యెల్లకాలమూ పుట్టింట వుండిపోతుంది కనకనా? అమావాస్య వెళ్ళిన రెండోరోజున నరసమ్మ రాజమండ్రీ వెళ్ళింది. అంటే పదిహేనురోజు లయిందిప్పటికి. ఇంతకీ ఆమె వెళ్ళిన అయిదోరోజున కోర్టుపనిమీద వెళ్ళి సోమసుందరం చూసేవచ్చాడు. అయినా పున్నమి వెళ్ళేటప్పటికి వారికి వందసంవత్సరా లయినట్లయింది. "అమ్మాయి లేకుండా వుండడంకష్టమే" అంటాడతను. "పిల్ల లేకపోవడంచేత పొయిదగ్గిరికి వెళ్ళడానికే అడుగు పడడం లేదంటుం దావిడ. నిద్రలో యేమో గాని మేలుకున్నంతసేపూ వారి కామెమీదే ధ్యానం.

ఒకనా డొక రైతు పనసపం డొకటీ, అనాసపం డొకటీ, బంగినిపిల్లిమామిడిపళ్ళు పాతికా, తేనెపానకం కుంచెడూ తెచ్చియిచ్చాడు. వాట్లని చూడడంతోటే వారికి కూతురు జ్ఞాపకం వచ్చింది. ఆపళ్ళమీద వాలివున్న యిద్దరి చూపులూ కలిశాటప్పటికి "అమ్మాయి—" అని అత నేదో అనబోగా "నోటికి పోవు" అంది రాజమ్మ. "రామం రోజూ యింతకంటె మంచిపళ్ళు తెప్పించుతూనే వుంటాడు. అయినా యిందులో మంచి వన్ని అది యేరుకుని దాచుకుంటేగాని మనం తిన్నట్లే వుండదు" అని అత ననగా "పోనీ పాలికాపుచేత పంపిద్దామా?" అని రాజమ్మ అడిగింది.

ఆమాటతో యిద్దరికీగూడా ప్రాణాలు లేచివచ్చాయి. "మధ్యాహ్నంబండికే పంపించేద్దాం" అంటూ సోమసుందరం లేచినుంచున్నాడు. "వెన్నపూస కాచితే మానెడు నెయ్యి అవుతుంది ఏమంటారూ?" అని ఆవిడ మళ్ళీ అడగా "కానియ్యి" మన్నాడతను. ఆ వేళకి తమ పశువుల నొక రైతు కప్పగించి కూతురికి పాలికాపుచేత ఏమిటేమిటో పంపా డతను. కూతురూ, అల్లుడూ ఆపళ్ళూ అవీ సుఖంగా తింటారన్న ఆనందంతో అప్పూటమాత్రం వారు ఖులాసాగా భోజనం చేశారు.

మధ్యాహ్నం చల్లబడ్డతరవాత యిరుగుపొరుగు స్త్రీలు ముగ్గురో నలుగురో యాదాలాభంగా పెత్తనాలకి రాగా రాజమ్మ వాళ్ళని యెసళ్ళ వేళదాకా కూచోబెట్టి నరసమ్మకి పళ్ళువైరా పంపిన సంగతి వన్నెచిన్నెలు పెట్టి చెప్పిచెప్పి పంపించింది.

ఆ స్త్రీలు గుమ్మం దిగారు. పాలికాపు వచ్చాడు. ఇంతే భేదం. పొయిలో నిప్పు వేద్దామని వంటింటోకి వెళ్ళిన రాజమ్మ వాడి కేక విని వక్కదూకున హాల్లోకి వచ్చింది. వాడేదో మాట చెప్పబోతూ వుండగా "నువ్వు వెళ్ళేటప్పటికమ్మాయిగారేం చేస్తున్నారూ? ఏమన్నారూ?

పంతులుగారింట్లో వున్నారా? లేరా? పళ్లు యింట్లో యెవరు పెట్టారు? వెంటనే యేమైనా తిన్నారా లేదా?" అని యిలాగ గుక్క తిప్పుకోకుండా ఆవిడ వందప్రశ్నలడిగింది. ఒక్కొక్కటే జ్ఞాపకం చేసుకొని జవాబు చెప్పడంలో వాడు తడబడుతూ వుండగా మళ్లీ కొన్ని ప్రశ్నలడిగింది. వాట్ల జవాబులమీద మళ్ళీ కొన్ని ప్రశ్నలు వచ్చాయి. అడగడానికావిడా, చెప్పడానికి వాడూ ఉక్కిరిబిక్కిరైపోయారు. అడిగినవాటికన్నింటికీ బదులు చెప్పి "యిక వెళ్లు" అనిపించుకొనేటప్పటికి వాడికి తాతలు దిగివచ్చారు. వెడుతూ వెడుతూ వాడు "మిమ్మల్నీ బాబయ్యగారినీ చూడాలని వుందిటండి అమ్మాయిగారి" కని చెప్పేటప్పటికి ఆమె మళ్లీ వెనక్కి పిలిచింది. మళ్ళీ ప్రశ్నలు కురిసిపోయాయి. ఇంతట్లో సోమసుందరం వచ్చాడు. సరే. వెళదామనుకొన్న పాలికాపు మళ్ళీ కూచుంటే గాని కుదిరింది కాదు. ఒక్కొక్క సంగతే మొదటికి వచ్చాయి. రాజమ్మ కూడా మళ్ళీమళ్ళీ అడగ్గా పాలికాపు "ఆమాటలు యిందాకా అడిగారు కాదండీ?" "దానికి జవాబు చెప్పాను కాదండీ?" "అది అడగడం మరిచిపోయానన్నాను కాదండీ" "ఆమాట మీరు చెప్పలేదు కాదండీ?" అంటూ యిలాగ విడిపించుకొన్నాడు. అంతా అయి వాడు లేచాటప్పటికి దీపాలు పెట్టేరు. అంటే నాలుఘడియలకుగాని వాడివతలికి రావడానికి వీలు కాలేదు. "నువ్వు రావనుకుని మీయమ్మ తనకి మాత్రమే వండుకుని తినేసివుంటుంది. అన్నం యిక్కడే తిందువుగాని" అని ఆదంపతు లిద్దరూ గూడా వాణ్ణి ఆపేశారు. రాజమ్మ అడిగిందే మళ్లీ అడుగుతుందనీ, ఈకారణంచేత వంటకింకా ఆలస్యం అవుతుందనీ, "వెళ్ళి మీయమ్మకి కనపడి రారా" అని సోమసుందరం వాడికి సెల విచ్చాడు.

౨

పాలికాపు యింటికి వెళ్ళడం రాజమ్మకి సుతరామూ యిష్టంలేదు. కాని ఏంచేస్తుందీ? కొంత సేపటికే "వాణ్ణి విసికించాను" అని యామెకే తోచింది. ఏమయినా జ్ఞాపకం వస్తే భోజనం అయినాక అడగవచ్చు ననుకుంది. ఈ నిశ్చయంతో ఆవిడ వంటింట్లోకి వెళ్లి నిప్పు రాజేశాటప్పటి కేదో తోచి యివతలికి వచ్చి భర్తతో చెప్పింది. ఆ విషయం ముగిశాక యింట్లోకి వెళ్లి బియ్యం కొలిచాటప్పటి కింకొకటి జ్ఞాపకం వచ్చింది. దానివిషయం కూడా తేలిపోయి మడి కట్టుకునేటప్పటికి మరొకటి జ్ఞాపకం వచ్చింది ఇలాగ వంటయి సోమసుందరం మడి కట్టుకుని వచ్చి పీటమీద కూచునిదాకా రాజమ్మ వంటింట్లోకీ వాకట్లోకీ యెన్నిమాట్లు తిరిగిందో లెక్క లేదు.

పాలికాపు చెప్పిన మాటలమీద యేదో సుఖమయకల్పన చేసుకుంటూ కొంతసేపటిదాకా ఆదంపతు లిద్దరూకూడా పైకి మాట్లాడలేదు. కాని భర్తకి మీగడ పెరుగు వడ్డించబోతూ రాజమ్మ హఠాత్తుగా నిలిచిపోయి "అమ్మాయిని చూడాలని యేమిటో వురకలు వేసుకువస్తోందండీ" అంది. "అంత తొందర యేం వచ్చింది?" అని అత నడగ్గా "ఏమో చెప్పలేను. అది వుబలాటమో మరేమిటో గాని తగ్గడం లేదు. నుంచోలేనుకూడానూ" అంటూ కూచుంది.

ఆసన్నివేశం చూశాటప్పటికి సోమసుందరానికూడా అలాగే తటస్థించింది. అందుచేత అతనుగూడా కలపబోతూ వున్న అన్నాన్ని విడిచిపెట్టి వెనకవున్న పీటకి చేరబడి "ఇలాగయితే యెలాగో తెలవదు గాని నాకూ అలాగే వుంది. ముందు ముందు విషమిస్తుందని అనుకుంటూనే మనం యిలాంటి మమకారాన్ని పెంచుకున్నాం. ఈసంగతి వింటే పయివాళ్ళు నవ్వుతారు గాని

యేం చెయ్యమూ? ఈ వేళ పళ్లుపంపి రేపు మనం వెడితే—రామం అలాంటివాడు కాడుగాని—లోకువ చెయ్యడు గాని అసంతృప్తి పడతాడేమో. అయినా మానలేము. పొద్దున్నే వెడదాం పద" అంటూ అతను మళ్లీ అన్నం కలిపాడు. దానితో రాజమ్మకి బలం వచ్చింది. "లోకులకోసం జడిస్తే యెలాగా? మనం కూడా రాజమండ్రీలో వుంటేనే బాగుంటుం దేమో అనిపిస్తూ వుంటుం దప్పుడప్పుడు. ఇంక రెండు మూడు మాసా లలవాటయితే యింత వులకం వుండదుగాని— అయినా రేపు పొద్దున్న ప్రయాణం తప్ప" దంటూ ఆవిడ పెరుగు వడ్డించింది. క్షణంలో అతను భోజనం చేసి లేచి, తమ ప్రయాణం సంగతీ, తాము వచ్చేదాకా చెయ్యవలసిన పనులూ పాలికాపుకి చెప్పి ప్రయాణపు సరంజామాలోకి దిగాడు. రాజమ్మ తాను కూడా భోంచేసి పాలికాపుకి అన్నం పెట్టి యిల్లంతా సద్దుకుని-యిదంతా నిమిషంలో ముగించుకొని అమ్మాయి కేమేనా పట్టుకొని వెళ్ళడమా మానడమా అంటూ పడకటింటిలోకి వెళ్ళింది. తన బట్టలు పైని పెట్టుకొని కావలసిన సొమ్ము పర్సులో వేసుకొని యేదో ఆలోచించుకుంటూ పడుకునివున్నా డతను. ఈ మాట విని లేచి కూచుని "బైటిచేలో నూతిదగ్గిర రెండు తెల్ల చక్రకేళీగెలలు చాలా పట్టుకి ముదిరివున్నాయి. ఆ రెండూ కొట్టిస్తాను. కొబ్బరికాయలు కూడా పట్టుకు వెడదాం. ఎందుకేనా కూడా వుంటే మంచిదని మన ఖర్చుకోసం తీసింది కాక పాతిక రూపాయలు పైగా తీశాను" అని బదులు చెప్పాడు. ఇద్దరూ బాగుందంటే బాగుందనుకున్నారు. రాజమ్మ పట్టుచీరా, దక్షిణాది చీరా యిస్తూ, "బెల్లంకూడా యేమేనా పట్టుకు వెడితేనో" అంది. "అలాగే అన్నా" డతను. పదికొబ్బరికాయలు వొలిచివాకిట్లో పెట్టి "వెళ్లేటప్పుడు—తెల్లవారగట్ల అరటిగెలలు కొట్టుకువస్తా"నని చెప్పి పాలికాపు వెళ్లిపోయాడు. పదకొండు దాటాక మూడుగంటలదాకా మాత్రమే వారు నిద్రపోయారు. తక్కినసేపంతా నరసమ్మ భవిష్యత్తును గురించి ఆలోచించుకోడానికీ, ప్రయాణమై వెళ్ళడానికీ సరిపోయింది.

మర్నాడు పొద్దున్న ఏడున్నరకి అనపర్తిలో రైలెక్కి ఎనిమిదిన్నరకి రాజమండ్రీ పెద్దస్టేషనులో దిగి సామానంతా పట్టించుకొని తొమ్మిదింటికి వారు వైగాంగ్రోడ్డులో వున్న కూతురుగారి యింటికి చేరుకున్నారు. వీరి బండి వీధిగుమ్మంలో ఆగేటప్పటికి "చుట్టాలా స్నేహితులా?" అంటూ రామం యివతలికి వచ్చాడు. "ఎవరండీ వారూ? మన యింటికే?" అంటూ నరసమ్మ వచ్చింది. ముందు రాజమ్మ బండి దిగింది. వెంటనే "మా అమ్మ" అంటూ నరసమ్మా, "నింపాదిగా వున్నావా తల్లీ" అంటూ రాజమ్మా ఒకర్నొకరు కౌగిలించుకున్నారు. ఇంతట్లో సోమసుందరం దిగి కళ్ళల్లో ఆనందబాష్పాలు సుడితిరిగి పోతూవుండగా "విశేషాలు లేవుగదా?" అన్నాడు. ఇలా అల్లుడూ మామా మాట్లాడుకుంటూ వుండగా నరసమ్మ వచ్చి "రండి నాన్నగారూ" అంటూ చెయ్యి పట్టుకుని యింటిలోకి బయలుదేరింది. ఇంటోకి వెళ్ళాక సోమసుందరం రామం యింగితం కనిపెట్టి "కారణం యేమీ లేదూ అమ్మాయిని నిన్నా చూడాలని బుద్ధిపుట్టింది. ఇక వుండలేకపోయా" మని చెప్పాడు. నరసమ్మ తల్లిని వంటింటిలో పీటవేసి కూచోబెట్టి అయింట్లోనే యితర భాగాలలో అద్దెకి వున్న వెంకటమ్మని, సుబ్బమ్మని, సూరమ్మని, పార్వతమ్మని, సావిత్రమ్మని, చిట్టెమ్మని, సరస్వతమ్మని పిలిచి రాజమ్మని చూపించి ఆడావిడి చేసింది.

అప్పటి కప్పుడే చారు తరవాయిగా వంట అంతా అయిపోయింది. చారేనా పొంగడం తరవాయి. తమ కిద్దరికేగదా అని నరసమ్మ తలగొట్టి తవ్వెడు బియ్యమే వండింది. అంచేత ఇంకో తవ్వె

డుబియ్యానికి మళ్ళీ యెసరుపెట్టి తండ్రిని స్నానం చెయ్యమంది.

3

భోజనం అయిన వెంటనే రామం కచేరీకి వెళ్ళిపోయాడు. రిజిస్ట్రారు కచేరీలో హెడ్డుగుమస్తాగా వున్నాడతను. నెలకి యాభైరూపాయలు జీతం కాకుండా పైగా రోజుకి రెండుపుంజీలైనా చేతులో పడతాయి. ఏలూరునుంచి అతను రాజమండ్రీ వచ్చి నాలుగేళ్ళయింది. ఇక్కడికి వచ్చాకే అతనికి హెడ్డుగుమస్తాపని కావడమూ, పెళ్ళి కావడమూ, పెళ్ళాం కాపరానికి రావడమూ కలిగాయి. దగ్గిర యేడెనిమిదివేలున్నాయని యిరుగూపొరుగూ చెప్పుతూ వుంటారు; గాని „నిలవా లేదు లోటూ „లేదంటా” డతను. ఆరువేలు పెట్టి వైగాంరోడ్డులో ఏడెనిమిదివందలగజాల కాళీస్థలం కొనడంమాత్రం అందరూ యెరుగుదురు. దాన్ని చూపుతూ „నేటివరకూ నాసంపాదన యింతే” అని అత నంటూ వుంటాడు గాని యెవరూ నమ్మరు.

మొత్తంమీద తెల్లవార్లూ నిద్రలేకపోవడమూ, పొద్దున్న రైలుప్రయాణమూ — ఈ కారణాలచేత అన్నరసం వంటపట్టేటప్పటికి నిద్ర కూరుకు రాగా సోమసుందరం పడుకున్నాడు. నరసమ్మ రామాన్ని కచేరీకి పంపడమూ, రాజమ్మ మొగుడికి పక్క సర్దడమూ అయేటప్పటికి పదిన్నర అయింది. అన్నీ సర్దించుకుని, అవసరమైన వన్నీ దగ్గిర పెట్టుకుని, తల్లీ కూతుళ్ళిద్దరూ భోజనాలకి కూచునేటప్పటికి పదకొండయింది. „అన్నట్టు మరచిపోయా” నంటూ కూచున్న వెంటనే లేచి నరసమ్మ మామిడిపళ్ళ బుట్ట దగ్గిర పెట్టుకుని మళ్ళీ కూచుంది. ఆయిద్దరూ యేకకాలంలోనే భోజనమూ కబుర్లూ మొదలుపెట్టారు.

రైతు పనసపండూ అప్పీ తెచ్చింది మొదలు ఇక్కడికి వచ్చేదాకా జరిగిన సంగతులన్నీ రాజమ్మ అడక్కుండానే చెప్పింది. ఇక యిక్కడ అల్లుడి ఆదరం యెలా వుందో అడుగుదామనుకుంటూ వుండగా నరసమ్మ అందుకుంది. „లంజముండ నన్ను చూస్తే యెగిరిపడేది. ఆవుదూడ చిక్కిపోకుండా వుందిటే అమ్మా” „పదియూత లీని ముసలిదైనా బుడిగావు పుహోషించిది. సూరిగాడు దానికి చాలినంతా పచ్చిగడ్డి తెస్తున్నాడా?” „దబ్బన్నగారి సుందరమ్మ ఆరేళ్ళపిల్లేగాని యింత కట్టె కంఠమూ అదీ పెనుక్కి వచ్చి పాటలు పాడుతోందా?” „విస్సన్నగారి సీతమ్మ నీళ్ళాడిందిటే?” „పేరుశాస్త్రుల్లుగారి నీలమ్మ సమర్తాడిందా” „యగ్గన్నమాసుగారి రత్తికి పెళ్ళి కుదిరిందిట కాదూ?” „సూరావధానులు తాతగారి సుభద్రకి పెళ్ళయిపోయిందిట గాదూ ద్రాక్షారంగుళ్ళోనూ?” „బంగారమ్మగారి అన్నపూర్ణకి కొడుకా?” „వానీ అమ్మా! వాళ్ళ రామసోదెమ్మ నామాట యెప్పుడేనా తెస్తోందా లేదే?” „లచ్చుమ్మత్తగారు రోజూ మనయింటికి వస్తున్నారా?” „ఆవీధి రామసోమయాజులుగారి లచ్చమ్మ అత్తారింటికి వెళ్ళిందా యింకా యిక్కడే వుందా?” „గులాబీచెట్లకీ, వల్లంటుకి నీళ్ళు బాగా పోస్తోందా పైడి?” „చామంతి చచ్చిపోకుండా చూస్తున్నావా?” „అన్నట్టుపగడం మరచిపోయాను వెంకప్పచయనులుగారి లచ్చబ్బాయికవడుగయిందా?” „వాళ్ళసుబ్బమ్మ మొగుడు నీకు వెళ్ళాడుట కాదూ? ఇంటోకి రానిస్తాడటే వచ్చాకా?” అంటూ యిలాగ ఆమె తల్లికి గుక్క తిప్పుక్కుండా అడగడం మొదలుపెట్టింది. ఇలాగ ఆవిడ ప్రశ్నిస్తే యీవిడ జవాబు చెప్పి, ఈవిడ ప్రశ్న వేస్తే ఆవిడ బదులు చెప్పి ఒక్కొక్క ముద్ద చొప్పున తింటూ పన్నిండయేటప్పటికి యిద్దరూ లేచారు.

ఇల్లు బాగుచేసుకుని, అంట్లు దొడ్లో వేసి, కూరా పులుసూ జాగ్రత్తచేసుకుని, నూతిదగ్గిరికి వెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కుని, వారిద్దరూ

వాకిట్లోకి వచ్చాటప్పటికి కింకో అరగంటయింది ఇంతవరకూ రాజమ్మకి కూతురుతో పాటు వంటింట్లోనే సరిపోయింది. అందుచేత అవిడ వాకిట్లోకి వచ్చిన వెంటనే అల్లుని ప్రయోజకత్వమూ, కూతురు పాక్తూ, కనిపెట్టడానికి ప్రతిగదీ చూడడానికి బయలుదేరింది. అది చూసి నరసమ్మ వెంటబయలుదేరి ,,ఇది పడకగది. పందిరిమంచానికి ఈదోమతెర మొన్ననే వచ్చింది. నాబట్టలు పెట్టుకోడానికి నిలువుటద్దం వున్న బీరువాకోసం మొన్ననే రాశారు చెన్నపట్నం. దాని ఖరీదు మీరిచ్చుకోవాలిట. ,,మేము రంగూన్ పెట్టి యిచ్చామంటే చాలదుట. యీకాలానికి తగినవివ్వాలిట. నాన్నగారితో చెప్పడం మరిచిపోకుసుమా. వక్కాందరూ పాయలకంటే యెక్కువ కాదుటలే. ఈబీరువా వారి బట్టలకీ పుస్తకాలకీని. ఈకడపరాతి బల్ల కొని మగాణ్ణెల్లయిందిట. ఆపడకకుర్చీలు రెండూ, ఆ మెత్తకుర్చీ ఆరుమాసాలకిందట వచ్చాయిట. ఆ అలమారుకి యింటివారితో పోరి మొన్ననే అద్దాలు పెట్టించారు. నువ్వు పంపిన మామిడిపళ్ళివిగో. పనసపండు రిజిస్ట్రారుకి పంపారు. అనాసపండు నిన్ననే అయిపోయింది. ఆసీసాలోది నేతిమిఠాయి. చేసి నాలుగురోజులే అయింది. ఈవేపువన్నీ యింగ్లీషుపటాలు. ఇవి కృష్ణమూర్తి విలాసాలు. కలకత్తా రాసి తెప్పించారుట. ఇవి రాములవారి వనవాసపుకష్టాలు. ఇవి దశావతారాలు. అది మా అత్తగారిదీ. అది మామామగారిదీని. ఈపాటిగ్రాపు నేనిక్కడికి వచ్చిన మర్నాడు తీసింది. ఇది మా చిన్నాడపడుచుది. వారిప్పుడు బెజవాడలో వున్నారు. ఈసంగీతపుపెట్టి ఈవూరు వచ్చిన కొత్తరికం కొన్నారుట. ఎన్నో పళ్ళే లున్నాయి దీనికి. అమ్మాయి వేదంకూడా చదివారేయిద్దరు దక్షిణాది బ్రాహ్మలూ. మంచిమంచి పాటలు రాత్రిపాడిస్తారు వింటువుగాని. ఇల్లు కట్టుకున్నాక యినపపెట్టి కొంటా నంటున్నారు. నువ్వీ పందిరిమంచం యివ్వాకమునుపు ఈ మడతమంచం వకటే వుండేదిట. ఇది మడిచేస్తే వకచేతిలో కిముడుతుంది. ఏందు జారిపోకుండా వుండడానికి యీగుడ్డ యెలా కట్టాడో చూశావా? ఇలా రాయిది వసారాగది. ఈవాటాలో ముట్టువాళ్ళకిది యెక్కువ వుపయోగంగా వుంటుంది. అది సామానుగది. అది వంటవసారాకదా? ఆవసారా వక్కటే యీవాటాలో యెక్కువ. అంచేతే తక్కినవాటికన్నింటికీ అద్దె పదేసే అయినా దీనికి పన్నెండు రూపాయలు. ఈవేపు అరుగుమీదే వున్నాయి డాబామీదకి మెట్లు. సంవత్సరంనరనుంచి కనిపెట్టికొని వున్నారుట యీ యింటికోసం. ఇంటివారు చాలా మంచివారు పాపం. చిన్నతాతగారి కామేశ్వరి అత్తయ్యవూరూ, ఈ యింటివారి చిన్నకోడలి పుట్టింటివారి వూరూ వకటే. యెదటిగుమ్మాలుట కూడానూ'' అని యిట్లా మె తల్లి అడిగినవీ, తనకి తోచినవీ, ఈరెండింటికీ సంబంధించినవీ గబగబ చెప్పేసింది. రాజమ్మ ,,అంతా బాగానే వుంది గాని అద్దె యెక్కువ. పదిరూపాయ లయితే బాగుండును'' అని చెప్పగా నరసమ్మ ,,ఇవ్వ''రని జవాబు చెప్పి పాందాను దీసుకొనివచ్చి కూచుంది.

ఇద్దరూ తాంబూలాలు వేసుకున్నారు. రాజమ్మ కూతురు అదృష్టానికి పొంగిపోతూ వుంది. నిలవ సంగతి వచ్చాటప్పటికి ,,ఆపెట్టెలో వెయ్యిరూపాయలూ. యాభై కాసులూ వున్నాయి మూడువేల నాలుగువందలు బాంకిలో వున్నాయిట. నాలుగువందల లొకరూ, తొమ్మిదివందల లొకరూ, మూడువందల పాతిక వకరూ, రెండువందలయెనభై వకరూ యివ్వాలిట. ఈ యేటి శిస్తు ఆరువందలూ రైతుదగ్గిరే అట్టిపెట్టేరు వడ్డీకి. మీదటికి మేడ కట్టుకుంటే యివన్నీ పైసలా. డబ్బిలుబంగాళా మేడ వేస్తారుట. వచ్చే వానాకాలంలో ద్వారబంధాలూ, తలుపులూ, కిటికీలూ, అలవర్లూ, చేయించి మాఘమాసంలో పని మొదలుపెట్టించా

అంటున్నారు. మేము యిల్లు కట్టుకుంటే పెద్దన్నయ్యా, చిన్నన్నయ్యా యేం సాయం చేస్తారో చూడా' లంటున్నారు. పెద్దన్నయ్య పోలవరంలో సర్కిలు ఇనస్పెక్టరుకనక కలప పూరికేనో, రాయితీగానో రావా లంటున్నారు. చిన్నన్నయ్య నూరురూపాయలు—ఒక్క నెలజీత మేనా యివ్వడుటే నాకూ? నాన్నగారు ఇటికెమట్టు కిస్తే బాగుండును. ఏమే అమ్మా! ఇప్పించవూ? భారం అంతా మీమీద వుందన్నారు" అని నరసమ్మ యింకా యేమిటో చెప్పబోతూ వుండగా రాజమ్మ అందుకుని "వోసి బళ్ళకొద్దీ నీ మొగుడు సంపాదించుకుంటూ వుండగా యిక మేం యివ్వడం యెందుకే?" అంది. దానిమీద కొంతసేపు సరాగాలు జరిగాయి. చివరికి రాజమ్మ "పెద్దన్నయ్యవల్ల కలప రాయితీగా వస్తుంది. చిన్నన్నయ్య కాకినాడలో యిల్లు కడతా నంటున్నాడు. ఇక మీనాన్నగారిమాటా? అది నేను చెప్పడం యెందుకూ? లేచాక నువ్వే అడుగు" అంది. ఇంకా అంటోంది. మాట ముగియలే దింకా. ఇలాంటప్పుడు సోమసుందరం మేలుకుని "అమ్మా" అని కేకవేశాడు. వెంటనే "వస్తున్నాను నాన్నగారూ" అంటూ నరసమ్మ లేచివెళ్ళి తండ్రిని తీసుకుని వచ్చి పడకకుర్చీ వేసి కూచోమంది. అతను నూతికి వెళ్ళి మొగం కడుక్కుని వచ్చి మంచినీళ్ళు పుచ్చుకున్న తరువాత మళ్ళీ గొడవలు మొదలయినాయి. నాలుగ్గంటలదాకా యెవరూ లేవలేదు. మూడుగంటలవేళ ముగ్గురూ కూంటుమామిడిపళ్ళు కోసుకుని తింటూ వుండగా బుట్టెడు పళ్ళు పట్టించుకుని రామం యింటికి వచ్చాడు. "ఇన్ని పళ్ళు యింట్లో వుండగా యెందుకు కొన్నావోయీ?" అని రాజమ్మ అడిగింది. "ఎవరో పంపారుకాబోలు" నని సోమసుందరం అన్నాడు. నరసమ్మ ఏమీ అనకుండా కూలిమనిషిని తీసుకుని మొగుడుతో కూడా యింటోకి వెళ్ళింది. కూలిది వెంటనే వెళ్ళిపోయింది. రామం నూతికి వెళ్ళి వచ్చేటప్పటికి నరసమ్మ ఒక పళ్ళెంలో మిఠాయి, ఒక పళ్ళెంలో మామిడిపండుముక్కలూ, వెండిచెంబుతో మంచినీళ్ళూ కడపరాతిబల్లమీద పెట్టింది. ఒక క్షణందాకా ఆవస్తువు లాకరి నోటికి కొరకరందించుకున్నారు; గాని కొంతసేపటికి నరసమ్మ "నాకు చా"లంది. "ఏమంటే" "మాఅమ్మకీ, మానాన్నగారికీ పెట్టి నప్పుడు తిన్నా"నంది. "ఇంకేమీ? చద్దన్నం తిన్నమ్మ మొగుడి ఆకలెరగదుట" అని రామం అన్నమాట ఒకటే యివతలికి వినిపించింది. కొంతసేపటికి తాంబూలం వేసుకుంటూ రామం యివతలికి వచ్చి "ఈవేళ తొమ్మిదింటికిగాని యింటికి రావడం పడదు. మీరుముందు భోజనం చెయ్యండి" అని మామగారితో చెప్పి వెళ్ళిపోయాడు. "నాకంత తొందరయేం వచ్చిందీ?" అని సోమసుందరం అన్నమాట అతనికి వినపడలేదు.

౪

ఇలా రెండురోజులు గడిచాయి. మూడోనాడు శనివారం. అది మూడో శనివారం కావడంచేత కచేరీ లేకపోగా రామం యింట్లోనే వుండిపోయాడు. పొద్దున్న యేడుగంటలవేళ బీరువాలో వున్న వెండికోపాలూ, సాసర్లూ, చంచాలూ తీస్తూ ఇవాళ మావాళ్ళు వెళ్ళిపోతారుట" అందినరసమ్మ. "ఇంకా రెండురోజు లుండగూడదూ?" అని రామం అడగ్గా "పని లేందే యెందుకూ వుండడమూ?" అంది. దానిమీద "ఇప్పుడు మహామించిపోయే పని వుండే వచ్చారుకామోసు"నని అత నవగా ఆమె "మీకిష్టం లేకపోతే వెళ్ళిపోతారులెండి" అని ముందరికాళ్ళకి బంధం వేసింది. ఇద్దరూ కొంచెంసేపు వేళాకోళాలు చేసుకొని యివతలికి వచ్చారు.

కాఫీ పుచ్చుకోడం అయినతరువాత సోమసుందరం "అమ్మా! బజారుకి వెడుతున్నాను. నీకేం కావాలో చెప్పు" అని అడగ్గా నరసమ్మ

"ఇప్పుడెందుకండీ?" అంది. "ఇవ్వడానికి ముహూర్తం యేమిటి తల్లీ? అలా తోచింది గాని కారణం యేమీ లేదు. ఏంకావాలో చెప్పు" అని అతను మళ్ళీ అడగ్గా "వద్దనగూడదమ్మా? ఏంకావాలో చెప్పు" అని రాజమ్మగూడా చెప్పింది. నరసమ్మ ఆలోచించింది కాని యేంకావాలో తోచలేదు. వారెంత సొమ్ము ఖర్చుపెట్టతలచుకున్నారో తెలుసుకోడానికి రెండు మూడు మాట్లలాగే అంది గాని తేలలేదు. ఈసమయంలో రామం యెందుకో గదిలోకి వెళ్ళాడు. ఎంచేతనో నరసమ్మ కూడా వెళ్ళింది. అది చూసి రాజమ్మ మందహాసం చేస్తూ మెల్లిగా "ఆలోచనకోసం" అంది. సోమసుందరం తలవూపాడు. ఇంతలో రామం యివతలికి వచ్చి "రిజిస్ట్రారుగారి యింటికి వెళ్ళివస్తానండీ" అంటూ సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

మరి పదినిమిషాలకి బ్రహ్మాండంమీద నరసమ్మ యివతలికి వచ్చింది గాని అప్పుడైనా యేమీ చెప్పలేదు. నవ్వు నామె చాలా కష్టంతో ఆపుకుంటూ వున్నట్లూ, ఏదో అసాధ్యవిషయం హృదయంలో జాగరితం అవుతూ వున్నట్లూ ముఖలక్షణాలు స్పష్టంగానే చెబుతున్నాయి. అయినా ఆమె పలకలేదు. "పొద్దెక్కుతోంది తల్లీ! తొమ్మిదింటి కింటికి చేరకోకపోతే యెండ చురచుర లాడుతూ—బైట వుండలేం. తొరగా చెప్పు" అని సోమసుందరం మళ్ళీ అడిగినా ఆమె మాట్లాడలేదు. అప్పుడు రాజమ్మ దగ్గిరికి వెళ్ళి "చెప్పమ్మా" అని బుజ్జగించగా ముఖం వంచుకునే వుండి యెంతో కష్టంమీద "నామట్టుకి ఉప్పాడజరీ చీర తెచ్చిపెట్టం" డంది. నామట్టుకంటే? రాజమ్మకీ సోమసుందరానికిగూడా అందులో యేదో వున్నట్లు తోచింది. ఇందాకా రామమూ నరసమ్మా యింటోకి వెళ్ళకపోతే వారి కోసం దేహం కలక్కపోవునేమో. అయినా షట్టుమాత్రమే తొడుక్కుని వున్న రామం గదిలోనుంచి వచ్చాటప్పుడు కోటు తొడుక్కొని టోపీ పెట్టుకురావడం ఇంటోకి వెళ్ళడానికి కారణం పెళ్ళాని కాలోచన చెప్పడానికి కాదని వాదించడాని కవకాశం యిస్తోంది గాని అయినా ఆలోచన జరక్కుండా వుండలేదని సోమసుందరం అభిప్రాయం. ఏమీ తోచక రాజమ్మా సోమసుందరమూ ఒకర్ని ఒకరు చూసుకున్నారు. ఇదంతా నరసమ్మ వోరకంటితో కనిపెడుతూనే వుంది. మరి పదినిమిషాలదాకా యెవరూ అధరస్పందమేనా చెయ్యలేదు. "అదేమిటో చెప్పు"మని సోమసుందరం అడగా లనుకున్నాడు. అడగడానికి తల యెత్తాడు. మాట నాలికచివరికి వచ్చిందికూడానూ. అప్పుడు హఠాత్తుగా రాజమ్మ "మొన్న వెళ్ళిపోయింది సంవత్సరాదిపండుగ. జ్ఞాపకం వుందా? కానయితే అమ్మాయి మన యింటోనే వుంది; కాని—" అని యింకా యేమో చెప్పబోతూ వుండగా అత నందుకొని "అవునవును. స్ఫురించింది కాదు" అంటూ కూతురి గడుసుదనానికి మెచ్చుకొని వెళ్ళిపోయాడు. తండ్రి వెళ్ళడంతోటే నరసమ్మ తల్లియెదట నుంచోలేక చరచర పడకటింటోకి పోయింది. "అంత సిగ్గెందుకే తల్లీ?" అంటూ రాజమ్మ వెనకాలే వెళ్ళింది గాని నరసమ్మ మంచంమీద గోడవేపుకి తిరిగి పడుకుంది.

తొమ్మిదిమ్ముప్పావయ్యేటప్పటికి సోమసుందరం ఒక పొట్లం తెచ్చి రాజమ్మ చేతులో పెట్టాడు. రాజమ్మ దాన్ని విప్పి ఒకచీరా, ఒక జామారూ పైకి తీసి అప్పటికిగూడా నరసమ్మ లేవకపోవడంచేత అరెండూ మంచంమీద పెట్టి వంటింటోకి వెళ్ళిపోయింది.

౫

మధ్యాహ్నం భోజనా లయినాక మొగుడికి తమలపాకుల చిలక అందిస్తూ "ఇవాళ మావాళ్లు వెళ్ళిపోతారుట" అని నరసమ్మ మళ్ళీ చెప్పింది.

,,పొద్దున్న చెప్పావు కాదూ?'' అని రామం ఆడగ్గా ,,చెప్పానా? మరిచిపోయాను కాబోసు. నాలుగున్నరగంటల బండికి వెడతారుట'' అని మళ్ళీ అంది.

,,ఇప్పు డిది రెండోమాటు చెప్పడానికి. తెలుస్తోందా?''

,,ఏమోనండీ. నాకేమీ తోచడం లేదు. మానాన్న యెప్పుడేనా వస్తూనే వుంటాడు కాని మాఅమ్మ యెన్నాళ్ళకి కనపడుతుందో మళ్ళీని?''

,,బెంగ పుడుతోందా యేమిటి?''

,,అలాగే వుంది. మనస్సు యెలాగో అయిపోతోందండీ''

,,అయితే ఒకమాటు వెళ్ళిరా పాపం''

,,మీరు పంపుతారా? ఏమండీ? పంపండి. నాలుగు — లెక్క నాలుగురోజులే వుండి మా నాన్నగారిని తీసుకుని మళ్ళీ వస్తాను. ఏం? పంపరూ? మీ కెంతేనా పుణ్యం వుంటుం దండీ''

,,పంపితేనా?''

,,అవునండీ?''

,, నువ్విక్కడ వుంటే నాకు పాపం వస్తుందా?''

,,కాదండీ. మీరు వెళ్ళమన్నారు కనక అన్నాను''

,,పంపకపోతే పాపం వస్తుం దనేనా?''

,,చూశారా? నేను అలా అన్నానా?''

,,సరిగా ఆమాటే అనలేదులే. అలా తేల్చావు''

,,అందులో ఆఅర్థం వుందా? చెప్పండకండి''

,,వుంటేమాత్రం యేంతప్పు సరుసూ? ఇంత మాత్రానికే చేతులు పట్టుకుని బతిమాలాలా? నువ్వన్న మాటలో ఆఅర్థం వుంది. అంటే తీస్తే వుంది; వేళాకోళానికి తీశాను''

,,పంపుతారా? మీరు చాలా మంచివారండీ. ఒక్కమాటు పంపండి. మళ్ళీ తొరగానే వస్తాను. ఒక్కమాటే మాఅమ్మని విడిచి చాలా రోజు లుండడం కష్టంగా వుందండీ''

,,అలా అయితే యెలాగ సరుసూ''

,,ఏం చెలాగో? ఇప్పు డేమీ తోచడం లేదు. సూరిగాడు పళ్ళు తెచ్చాక మాఅమ్మని చూడాల అని బుద్ధి పుట్టింది. ఆ రాత్రి అది యెక్కువయింది. ఆరాత్రి నేనెలాగో వున్నాను మీరు కనిపెట్టారో లేదోగాని''

,,అంచేతే యిప్పుడు వెడతావా అన్నాను''

,,దయవుంచి మీరు పంపితే వెళ్ళనూ? మర్నాడు మావాళ్ళు వచ్చారుకనక సరిపోయింది కాని లేకపోతే మతి పోయి వుండును''

,,నయమే. అయితే — సరుసూ ఇక్కడ నాసంగతి తెలుస్తూనే వుందికదా నీకు? నువ్వు మహేంద్రవాడ వెడతా నంటే వద్దనలేను కాని — త్వరగా నే వస్తావు నువ్వు తప్పకుండా — అయినా యిల్లు అడివిలాగ తోస్తుంది నాకు''

,,అమ్మా! అయితే వెళ్ళనే వెళ్ళను. మీ సుఖంకంటేనా? మీరీమాట చెప్పడంచేత అక్కడికి వెడితే యిక నామనస్సంతా యిక్కడే వుంటుంది. ఇక ఆమాట యెత్తకండి''

,,అలా కాదు. ఆడాళ్ళకీ మొగాళ్ళకీ భేదం వుంది. అందులోనూ నీసంగతి వేరూ. వెళ్ళిరా''

,,వద్దండీ. వెడతా ననడానికి ముందున్నట్లు లేదు మీముఖకళ. ఏదో చిన్నపోయినట్లుంది''

,,లేదులేదు. అయితే చిలకలాంటి పెళ్ళాన్ని విడిచివుండడం అంటే ఎప్పుడూ కష్టమే కాని యిన్నివిధాల మనోల్లాసం కలిగిస్తూ వున్న నీకు సంతోషం కలిగించడంమాత్రం నాకు విధి కాదూ? నువ్వు వెళ్ళిరా. మానవద్దు వారంరోజులకంటే మాత్రం యెక్కువ వుండకు''

,, మీ రిలా అంటూంటే వెళ్ళాలని వుంది మానాలని వుంది. వుండాలేను. వెళ్ళాలేను''

"..వెళ్ళమానకు. జడిసిపడకు"

"మీరు మంచివారు కనక వెళ్ళమంటున్నారు. మీరు వెళ్ళమంటున్నారు కనక వెళ్ళడానికి నాకు సాహసం పుట్టకుండావుంది. అయితే ఏక మూల వెడదామన్న ఆశ పీకుతూనే వుంది సుమండీ"

"ఇంకెందుకూ మరి? వెళ్ళాలనుకున్న ప్రయాణం మానేస్తే అదో బెంగ. తప్పకుండా వెళ్ళిరా"

"మీరు చూస్తే యిలా చెబుతున్నారు. మావాళ్ళేమంటారో? అయినా చూస్తానుకాదూ?"

ఇలా అంటూ నరసమ్మ యివతలికి వచ్చింది. రామం వకక్షణం నిశ్చేష్టుడుగా వున్నాడు. ఇంటో మూడ్రోజులైనా ఖైకరూ లేకపోవడంచేత వచ్చి కొద్ది రోజులే అయినా, యిదే తొలిమాటు రావడం అయినా యెరమర లేకుండానూ చాలామట్టుకు సిగ్గు లేకుండానూ, యౌవనవ్యగ్రతవల్ల పురకలు వేసుకువచ్చే సుఖాశచేత నరసమ్మ జీవితాన్నర్పించేస్తోం దతనికి. ఆక్షణంలోనే యీయిరవై రోజులలోనూ నరసమ్మ చూపిన విలాసం అంతా కళ్ళకి కట్టినట్లయింది. పల్లెటూరి పిల్లయినా ఆమెకి నాగరిక విలాసాలన్నీ బాగా తెలుసును గూడకట్టూ, బులబులాగ్గా వుండే వాలుజడా, దుద్దులికి తోడు లోలకులూ, ముంజేళ్ళకి తోడు చెంపసరాలూ, మునిమునినవ్వులు నవ్వితే తాంబూలరాగాని కూడా జీవకళలిచ్చే సహజరక్తిమాలైన ఆ పెదవులూ, తామరపూవులోవుండే తుమ్మెదల్లాగ ఆపచ్చని ముఖానికి శోభ తెస్తూ వున్న అనల్లని కళ్ళూ—ఇవన్నీ తలపుకివచ్చి ఆమె మహేంద్రవాడ వెళ్ళడం అంటే అతనికి గుండె గుభేలుమంది. కాని అలాంటి ప్రాణేశ్వరి కోరిక తీర్చకపోవడం రాక్షసకృత్యం అనుకున్నా డతను. కాదూకూడదు వల్లకాదంటే నరసమ్మ యేమనుకు చెప్పదు. కాని మనస్సు చివుక్కుమంటుంది. ముఖంలో అప్రసన్నత వుండదు. వద్దన్నందుకు తన మనస్సు కూడా చివరికి కించపడుతుందేమో. ఇదంతా ఆవక్షణం లోనే అతను చర్చించుకున్నాడు. "పంపుతాను" అని నిశ్చయించుకున్నాడు. నరుసు తన వుద్దేశాన్ని సూచించలేకపోయినా—వాడు కనిపెట్టలేకపోయినా—తీసుకువెళ్ళా లనుకోకపోయినా తీసుకుని వెళ్ళి వారంరోజు లుంచుకుని పంపండని నేనే చెబుతా"ననికూడా అతను స్థిరపరుచుకున్నాడు.

౬

నరసమ్మ యివతలికి వచ్చేటప్పటికి "అప్పుడు కంగారు పుడుతుంది" అంటూ సోమసుందరం తోలుపెట్టె సద్దుతున్నాడు. "బజారుకి వెళ్ళడం మరిచిపోతారుసుమండీ" అంటోంది రాజమ్మ. గదిలో వున్న అడుగు యివతల పెడుతూ మాటలో లో మాట కలిపి "నారింజపళ్ళు కాకినాడలో దొరుకుతాయో లేవో కొనుక్కు వెళ్ళి చిన్నన్నయ్యకి పంపరాదుటండీ నాన్నగారూ?" అంది నరసమ్మ.

ఆమాటా యీమాటా మొదలయినాయి. తానివతలికి వస్తే రంగు చెడిపోతుం దనీ, పెళ్ళాం గడుసుదనపుమాటలు వినాలనీ, వుక్కపెడుతూ వున్నా గదిలోనే వుండిపోయాడు రామం. మొగుడు చూపిన ఆదరణవల్ల మనస్సు పొంగిపోతూ వుండగా తన వుద్దేశాన్ని తల్లిదండ్రులికి చెప్పినట్లు కాకుండా తెలపడానికి చక్కని మార్గం వూహిస్తోంది నరసమ్మ. రెండు నిమిషాలలో పెట్టె సద్దడం ముగించి "తల్లీ ఇక జట్కా యెక్కడం తరవాయి" అన్నాడు సోమసుందరం. రాజమ్మకేసి చూసి "ఎరువకి వెళ్ళడం అయినా గోదావరి స్టేషనుకే వెడదాం. వెళ్ళేటప్పుడే పుచ్చుకోవచ్చు కావలసిన వన్నీని" అనికూడా చెప్పాడు. అప్పుడు నరసమ్మ మెల్లిగా అందుకుంది.

"మళ్ళీ తొరగా రావాలిసుమండీ నాన్నగారూ"

"ఎల్లుండికి వారంనాటి సోమవారంనాడు తప్పకుండా వస్తానమ్మా"

"మీనాన్నగారికి జ్ఞాపకం లేకపోతే నేను పంపిస్తాను లేవే అమ్మాయీ"

"అవునలా చెయ్యవే అమ్మా"

"ఆవేళ కోర్టు పని వుంది తప్పకుండా వస్తానమ్మా"

"అమ్మ మళ్లీ యెప్పుడు కనపిస్తుందో!"

"ఇంక మునపటిలాగ అస్తమానూ అమ్మ కావాలంటే యెలాగమ్మాయీ? అలవాటు చేసుకో"

"ఏమే అమ్మా! వాళ్ల సుందరమ్మ యెలా కనపడుతుందే మరీ? వాళ్ల అమ్మని. నాన్నని బతిమాలే నని చెప్పి మీరు వచ్చేటప్పుడు వకమాటు తీసుకురండి నాన్నగారూ"

"అలా చేస్తే బాగుండదమ్మా. శ్రావణమాసందాకా వోపికపట్టు"

"అమ్మో! వుండలేనండీ"

"అలా అయితే యెలాగ అమ్మాయీ? వచ్చినప్పుడల్లా మీనాన్న చెబుతూనే వుంటారు కాదూ దాని కబుర్లూ?"

"నీకేం చెబుతావు. బుడిగావు పాలన్నీ తోడుపెట్టుకుని నువ్వు వక్కత్తివే తాగుతున్నావు కమ్మగా పెరుగంతానూ. శ్రావణమాసంలో నేను వచ్చేటప్పటికి సుకుమ్మరం అంతా తగ్గిపోతుంది"

"సూరిగాడి చేత పంపిస్తూ వుంటానులే నాలుగురోజుల కోమాటు:"

"మల్లిపందిరి బాగా పూస్తోంది కామోసు. అంత పరిమళం యెక్కడా చూడలేదూ నేను. ఇక్కడ అమ్మో వన్నీ కాకినాడపువ్వులు. అక్కడ పొద్దున్నే కొయ్యడంచేత బాగా యెదక్క వాసనే వుండదూ"

"మొయిలుబండికి యెవరేనా వచ్చేవాళ్లు వుంటే పంపిస్తూ వుంటానులే"

"వేసంకాలంలో యీవూరు వేడిమంగలంలా వుంటుంది. మన వూళ్లో వుంటే ఆకొబ్బరిచెట్లూ, ఆఅరటిచెట్లూ, ఆగానుగచెట్లూ — చల్లదనమూ, చల్లగాలీ మన యింట్లోనే వుంటాయి"

"యింకో పదిరోజులు పోతే నీకిక్కడే బాగుందనిపిస్తుంది"

"మీదటికీవూళ్లో మెరుపుదీపాలూ, పంకాలూ వుంటాయి. మీరు మేడ కట్టుకునేటప్పటికి తప్పకుండా వస్తాయి, అప్పుడు సుఖమంతా మీదేనమ్మా"

"మీదటి మాట చెబుతారు నాన్నగారు. ఎప్పుడో పన్నెండు మాసాలనాటి గొడవ. దిక్కుమాలింది. నాలుగు మైళ్ళుంది అనపర్తి స్టేషనుకీ మహేంద్రవాడకీని. అన్నప్పుడల్లా బోయీలు దొరుకుతారా చేస్తారా? లేకపోతే ద్వారపూడిలో దిగి జట్కా కుదుర్చుకుని తణుకోయి మాచారంలాగ మండపేట దగ్గిరనుంచి, మాచారం రేవులోనుంచి, రాయూరంమీదనుంచి చుట్టు తిరిగి చేరుకోవాలి. అదీ కాకపోతే చచ్చినట్లు నడవాలి. స్టేషనువున్న వూరయితే ఆదివారం ఆదివారమూ వస్తూ వెడుతూ వుందును"

ఈ మాట వినడంతోటే రాజమ్మకి హఠాత్తుగా యేదో తోచింది. "ఇప్పుడైతే యేమీ? రేపెలాగా సెలవే. ఈ వేళ గూడా సెలవయింది కనక — ఏమండీ? అమ్మాయినీ అల్లుణ్ణి వకమాటు తీసుకువెడితే యేమీ? సోమవారం పొద్దున్నే వచ్చేస్తారు మళ్ళీని" అంది ఆవిడ. సోమసుందరానికి దీన్లో ఏమాత్రమో సబబున్నట్లు తోచింది. ఎలాగా? అంటూ అతను సరిగా కూచునేటప్పటికి ఆమె యింకా విస్తరించి చెప్పింది. తల్లి ఇలా చెబుతూ వుంటే తన కోరిక నెరవేరేటట్లు వుండడంచేతా పైగా మొగుడుకూడా వచ్చేటట్లు వుండడంచేతా నరసమ్మ ముఖం పక్కకి తిప్పుకుని ముసిముసినవ్వులు నవ్వుకుంది. లోపల రామంకూడా పెళ్లాం

తెలివితేటలికి పొంగిపోయాడు. „అత్తగారంటున్నారు. ఇక ప్రయాణంతప్పను. బుడిగావు పాలూ పెరుగూ నాకుకూడా దొరికే యున్నమాట్లే" అని కూడాసంతోషించాడు.

„వూరుకుంటారేం? రామంతో చెప్పండి యీ మాట. ఎల్లుండి జాముపొద్దెక్కేటప్పటికి మళ్లీ రావచ్చు" అని రాజమ్మ తొందర పెట్టగా సోమసుందరం „ఏమంటావు తల్లీ?" అన్నాడు. నరసమ్మ ఇక అక్కడ నుంచోలేకపోయింది. నవ్వు వురకలు వేసుకొస్తోంది. క్షణం వుంటే బయట పడిపోతుంది. అందుచేత ఆమె „ఏమో మీయిష్టం" అంటూ మరేమీ చెప్పకుండా నూతిదగ్గిరికి వెళ్లిపోయింది. „లేవండీ. అతను వప్పుకుంటేఇల్లంతా సద్దుకోవాలికూడానూ. తొరగా అడగం"డని రాజమ్మ మళ్లీ తొందరపెట్టింది. అప్పుడుకూడా రామం ఏమనుకుంటాడో అన్నాడతను. దానిమీద మీకు సందేహం అయితే నేను చెబుతాను వుండండంటూ ఆమె తటాలున గదిలోకివెళ్లి „రామం ఒక్కమాటు లేవవోయీ" అంది. ఇదంతా వింటూనే వున్న రామం గాఢనిద్రలో వున్నట్లూ యీమాట విని లేచినట్లూ కళ్లునులుముకుంటూ లేచి కూచుని „ఎందు"కన్నాడు. ఒకమూల నవ్వాపుకోవడమూ, నిద్రబద్ధకొన్నభినయించడమూ చాలాకష్టంగానే వున్నాయతనికి.

„రామం రేపు ఆదివారమేకదా? ఇవాళ సెలవే. నువ్వూ మాఅమ్మాయీకూడా మాతో రండి మహేంద్రవాడ. మళ్ళీ సోమవారం పొద్దున్నబండికి వచ్చేస్తురు గాని"

„మొన్ననే కాదుటండీ మీఅమ్మాయి అక్కణ్ణుంచి వచ్చిందీ?"

„అయినా చిన్నపిల్లకాదూ? ఇంకోయేడాది పోయిందంటే విడిచి వుండడం దానికి మాకూ గూడా అలవాటవుతుంది. ఇంతకీ మే మిక్కణ్ణుంచి వెళుతున్నాం కనకనూ సమయానికి రెండు రోజులు సెలవులు వచ్చాయి కనకనూ యిలా తోచింది. యిక మాట్లాడకు. సద్దుకో"

„సోమవారం పొద్దున్న యిక్కడ వుండకపోతే మాట తక్కదు సుమండీ'

„అక్కడ వుండనేవద్దూ. బోయీలుసిద్ధంగానే వుంటారు. లేకపోతే రాయూరాన్నుంచి జట్కా పిలిపిస్తాను. తెల్లవారగట్ల నాలుగ్గంటలికి లేచి యిద్దరూ వస్తురుగాని"

„తీరా అక్కడికి వెళ్లాక మీఅమ్మాయిని అట్టే పెట్టుకుంటామంటారేమో"

„ఎందుకూ? శ్రావణమాసంలో వచ్చి విఘ్నేశ్వరుడి చవితి వెళ్లిదాకా వుంటుందికాదూ? మళ్లీ సుబ్బారాయుడుషష్ఠికి వచ్చి సంకురాత్రి వెళ్ళేదాకా యెలాగా వుంటుందాయె. ఎల్లుండి తప్పకుండా నీతోటే పంపేస్తాములే"

„మీ అమ్మాయి యేమంటుందీ"

„రానంటుందా యేమిటది? నువ్వు లేస్తూ"

దీనిమీద „ఇప్పుడెందుకండీమామగారూ?" అంటూ అత నివతలికి వచ్చాడు. „మీఅత్తగారన్న మాటలో తేడా లేదు. మరి లే" అన్నాడు సోమసుందరం. అయితే „మాఆఫీసరు గారితో చెప్పి రావా" అంటూ మొగం కడుక్కోడానికి నూతిదగ్గరికి వెళ్లాడతను. నరసమ్మ అక్కడ కరివేపచెట్టుక్రింద నుంచుని వుంది వారిద్దరూ ఒకర్నొకరు చూసి నవ్వుకున్నారు. „ఏమన్నారు మావాళ్లూ?"అని నరసమ్మ అడగ్గా „చూస్తూ వుండగా మీఅమ్మనీ, మీనాన్ననీకూడా బుట్టలో వెట్టేసి యింకా యేమన్నా రంటావే" మన్నాడు రామం. „వెళ్లి బట్టలు సద్దుకో„ అనికూడా చెప్పాడు.

ఇలాగ ఆయాచితంగా యేకాంతవాసం తటస్థించగా రాజమ్మ కొంచెం నింపాదిగా „అ

యిన పదిరూపాయల జామారూ యిక్కడివ్వడం యెందుకూ? అక్కడే కట్టపెడదాం ముంతెడునీళ్ళు పోసి'' అని చెప్పగా సోమసుందరం ,,అదే బాగుం'' దన్నాడు.

రామం పైకి లెక్కి వెళ్ళిపోయాడు. రాజమ్మ కూతుర్ని వెతుక్కుంటూ వెళ్ళి ,,రావే అమ్మాయీ యిల్లు సద్దుకుందాం'' అంటూ జరిగిందంతా చెప్పింది. తరువాత గదిలో పెట్టడానికి తల్లి బిందెలు తెస్తూవుండగా తాను వెండిచెంబులు తెస్తూ, ,,సోమవారం పొద్దున్న తప్పకుండా పంపెయ్యాలిసుమా'' అంది నరసమ్మ.

2

తెల్లవారేటప్పటికి రాత్రి నరసమ్మ వచ్చిన సంగతి మహేంద్రవాడలో ఆయీడుపిల్లల కందరికీ తెలిసింది. చెరువుదగ్గరనుంచి యింటికి వెడుతూ ముందు సోదెమ్మ చూడ్డానికి వచ్చింది; గాని అప్పటి కింకా నరసమ్మ లేవలేదు. ఆపిల్ల రెండుమూడుమాట్లు పిలవగా రాజమ్మ మెల్లిగా ,,మొగుడున్నా'' డంది. దానిమీద సోదెమ్మ ,,యింకేమీ? ఇక చద్దన్నాలవేళే లేవడం'' అంటూ వెళ్ళిపోయింది. ఆమాటకి సమాధానం చెబుదామని మేలుకునే వున్న నరసమ్మ వూచలాగ యివతలికి వచ్చింది గాని అప్పటికప్పుడే ఆపిల్ల మలుపు దాటిపోయింది.

ఇంకో క్షణానికి రామం లేచాడు. కాల్యకృత్యాలు తీరడమూ మంగలి సంతనాగా తలంటడమూ వరుసగా అయిపోయాయి. ఇవన్నీ ముగిశాటప్పటికి రాజమ్మ వుపమా, కాఫీ తయారుచేసి గదిలో పెట్టి ,,యిద్దరూ పుచ్చుకోండి'' అని చెప్పి వెళ్ళిపోయింది.

వారిద్దరూ వుపమాపళ్ళెం ఖాళీచేశాటప్పటికి ,,లాజమ్మత్తా, పెలుగివ్వవూ?'' అంటూ సుందరమ్మ వచ్చింది. అది విని నరసమ్మ ,,వకపాట పాడితే గాని యివాళ పెరుగివ్వం'' అనగా ఆపిల్ల ,,నువ్వెప్పుడు వచ్చావే నలసమ్మొదినా?'' అంటూ వక్కదూకున వచ్చి రామాన్ని చూసి ఆగిపోయింది. నరసమ్మ ,,భయం లేదులే'' అని పోయి తీసుకువచ్చి దగ్గిర కూచోపెట్టుకుని ,,వుపమా అయిపోయిందే'' అంటూ కాఫీమాత్రం యిచ్చింది.

సహజంగా అది వేసవి కావడంచేతా, అప్పుడే స్నానాలు చేసి వుండడంచేతా, పైగా వేడివేడి కాఫీ పుచ్చుకోవడంచేతా ముగ్గురికీ కూడా ముచ్చెమటలూ పోశాయి. రామంనరసమ్మకీ, నరసమ్మ రామానికీ విసరడంలో యెడతెగకుండా గాలి తగలడంచేత సుందరమ్మ చెమట ముందారిపోయింది. అందుకు మొగుడూపెళ్ళా లిద్దరూ నవ్వుకున్నారు.

అయిదారుమాట్లు బలవంతం చెయ్యగా సుందరమ్మ పాట మొదలు పెట్టింది. పల్లవి ముగిసింది. అనుపల్లవి అందుకుంది. కంఠం యింకా సాఫుకా లేదు. కళ్ళు తిప్పుకోవడం చూడమని నరసమ్మ రామానికి సంజ్ఞ చేస్తోంది. అలాంటప్పుడు అయిదారుగురు చెలికత్తెలు వచ్చి వాకిట్లో నుంచుని పిలిచారు. వెంటనే పాట మానిపించి ,,వస్తానుండం'' డంటూ యివతలికి వచ్చింది. ఆ రావడం రావడం పదిగంటలదాకా ఆమె యివతలే వుండిపోవలసివచ్చింది. ఆ రెండుమూడుగంటలూ అతను మతిపోయినవాడిలాగ గదిలోనే కూచున్నాడు. కార్యం కాకమును పెప్పుడేనా మహేంద్రవాడ వస్తే కాఫీ పుచ్చుకోవడం తరవాయిగా వూళ్ళోకి పెత్తనాలికి వెళ్ళేవాడు. ఇప్పుడుగూడా పాపం అలాగ అనుకుంటూనే వచ్చాడు గాని చివరికి ఇకనే వస్తుందో యిప్పుడే వస్తుందో అని కదల్లేకపోయాడు. మామగారు భోజనానికి లెమ్మనిదాకా అతనలాగే వున్నాడు. అప్పటికిగూడా వాకిట్లో యువతుల సభ ముగియనేదు. అతనికి కాళ్లు కడుక్కోడానికి నీళ్ళు అత్తగా రివ్వవలసివచ్చింది. పట్టుతాపితా స్వయంగానే తీసుకోవలసివచ్చింది

వాకట్లో మాట లాగిపోయినప్పుడల్లా అతను భోజనం చేస్తూ ఎదట వున్న కిటికీకేసి చూసేవాడు గాని యినపవూచలూ, షాట్ల కవతల పక్కయింటి గంటచూరూ తప్ప నరసమ్మ ముఖం కనపడేది కాదు. అల్లుడి భోజనం యెలాగో వుండడం చూసి వాళ్ళని వెళ్ళిపొమ్మందామని రాజమ్మ నాలుగైదుమాట్లివతలికి వచ్చింది గాని ఆవిడమాట లెవరూ వినిపించుకోలేదు.

సోమసుందరం చెయ్యి తుడుచుకుంటూ యివతలికి వచ్చి „అన్నానికి వెళ్ళు తల్లీ” అని చెప్పేదాకా యెవరూ కదల్లేదు. అప్పుడేనా వకమాటు నరసమ్మ కనపడుతుం దని రామం అనుకున్నాడుగాని ఆమె తిన్నగా వంటింటోకి వెళ్ళిపోయింది. „తాంబూలం యిచ్చిరావే” అని తల్లి అంటే „నాకాకలేస్తోంది బాబూ అన్నం తింటే గాని నేనివ్వలే” నంది.

ఏడున్నరకి విడిపోయిన ఆదంపతులు పన్నెండు గంటలికిగాని మళ్ళీ కలుసుకోడానికి కుదిరింది గాదు. ఈలోపున రామం యింకెప్పుడూ మహేంద్రవాడ రాకూడ?” దని నాలుగైదుమాట్లనుకున్నాడు గాని „వుండగలవా?” అని బుద్ధి నిలవతీసి అడిగి ఆనిశ్చయాన్ని తొలగించివేసింది. అంతసేపటికి యింటోకి వచ్చి యేంచేస్తుందో చూద్దామని గాలిచాలక చెమటపడుతూ చిరాకుగా వున్నా అతను గుట్టుగా పడుకున్నాడు పాపం నరసమ్మ లోటు లేదు, „కోప్పడకండేం” అని బతిమాలుకుందామని ఆమె యింటోకి వచ్చాటప్పటి కత నిలా వున్నాడు. దగ్గిరికి వెళ్ళి నుంచుంది. మీద చెయ్యి వేసింది దానితో అతని శరీరం అంతా గరిపొడిచింది గాని ఆమె కనిపెట్టలేదు. కదిపింది. చెవిలో నోరుపెట్టి మెల్లిగా పిలిచింది. అతనికి నవ్వాగలేదు గాని యెలాగో యింకా గుట్టుగానే వున్నాడు. చివరి „కిదిగాదు పని” అని చక్కలిగిల్లి పెట్టాప్పటికి యెగిరిపడి లేచికూచున్నాడు. ఇద్దరికీ నవ్వు వచ్చింది.

„కోపం వచ్చిందా?”

„నువ్వింతసేపు నన్ను విడిపెట్టి వెళితే రాదా యేమిటి?”

„వాళ్ళంతా వచ్చి కూచుంటే యెలా రాను చెప్పండీ?”

„ఏదో వంక పెట్టి పంపెయ్యాలి”

„అలాంటిమాట నోరుజారి వచ్చిం దంటే ఇక బతగ్గలనా వాళ్ళ యెదట?”

„కొడతారా యేమిటి?”

„కొట్టినంత పని చేస్తారు. ఆమాటకి వస్తే కొడితేనే నయం. సూదులకంటే చురుకైన మాట లంటారు. కొడతారా అంటే పొద్దున్న ఆలస్యంగా లేచినందుకు బుగ్గలు చిదిమి చేతులో పెట్టింది బుచ్చమ్మత్తగారి సోదెమ్మ”

„ఇంకెప్పుడూ నేను మహేంద్రవాడ రాకూడదు. నాకిక్కడ యేమీ పనిలేకపోయె. నువ్వు లోకాభిరామాయణం విప్పి చెలకత్తెలతో కూచుంటావాయె. మీనాన్నగారు పొలమో రామచంద్రపురమో వెళ్లి కూచుంటారు. పూరమ్మట బయలుదేరాలి. అలా అయితే యిక యిక్కడికి వచ్చిన సుఖం యేంవుందీ?”

„ఆమాటమీద వుండండి. ఇక్కడికి వస్తే నేను చెలికత్తెలతో కూచుంటానన్నారు. అక్కడ మీరు కచేరీలో కూచోరూ? నేనే నయం కళ్లకి కనపడుతూనే వుంటాను. వినిపించుకుంటే మామాట లన్నీ మీకు వినపడుతూనే వుంటాయి. నాకేం వుందీ! ఏయిరుగుపొరుగమ్మైనా దయతలిచి వస్తే వుంది లేకపోతే గుడిపాములాగ వురూరుకుంటూ యింటో కూచోవలసిందే కాదూ?”

„.............”

„మాట్లాడరేం?”

„నోరు కట్టేశావు నువ్వు”

„అయితే తమలపాకులచిలకలతో విప్పుతానుండండి.”

ఒకరి కొక రందించుకుంటూ వారిద్దరూ తాంబూలం వేసుకునేటప్పటికి „వొసే రాజా, నరసమ్మ వచ్చిందిట కాదుటే?” అని వాకట్లో నుంచి ఒక మాట వినిపించింది. అది విని నిరాశతోటీ, నిస్పృహతోటీ రామం „మళ్లీ మిూదలూ” అన్నాడు. „వెళ్లి కనపడకపోతే బాగుండదు. నేనంటే ప్రాణం యిస్తుంది మాలచ్చమ్మత్త. నాలుగు మాటలు చెప్పి మరిపించి వచ్చేస్తాను. మాఅమ్మా, ఆవిడా కూచున్నా రంటే యిక యేమీ కనపడదు వాళ్లకి” అని చెప్పి లేచి „మళ్లీ కొప్పడకండేం” అంటూ గడ్డంపట్టుకుని కళ్లతో బతిమాలి నరసమ్మ వాకట్లోకి వెళ్లిపోయింది. రామానికి శిరస్సుమీద రాళ్ళూ, పువ్వులూ కలిసి పడ్డట్టయింది.

అన్నప్రకారం నరసమ్మ అయిదునిమిషాలకే వెనక్కి మళ్ళింది కాని „రాత్రనగా వచ్చి కనపడ్డావే కాదేమిటే మాతల్లీ? అంతఃపురంలో కాయేమిటి మహా చురుగ్గా వెళుతున్నావు? నుంచో కాస్సేపు తొందరలేదులే” అంటూ నిమ్మన్నగారి సీతమ్మ గుమ్మంలోనుంచే కేక లేస్తూ వచ్చి „మా అన్నయ్య యేం చేస్తున్నాడూ? రామం అన్నయ్యా! నువ్వూ వదినా మాయింటికో మాటు వెంటనే రావా” అంటూ చిటికెలు వేస్తూ పిలిచింది. దానిమీద పడుకొని వున్న రామం లేచి కూచుని, కూచున్న వెంటనే కిందకి దిగి „మీావదిన అదిగో. నేను సిద్ధం” అంటూ యివతలికి వచ్చాడు. ఆ చెలికత్తెలుకూడా వేళాకోళాలు చేసుకుంటూ యివతలికి వచ్చాటప్పటికి „వాళ్ళెందుకే సీతా?” అని రాజమ్మ అడిగింది అందుమీదట „నీకూతుర్ని తీసుకువెళ్లి మాఅన్నయ్యచేత కొట్టించనులే. వైశాఖపూజ చేస్తున్నాడు మానాన్న. సోమసుందరం మామ ఇప్పుడే వెళ్లాలా రామచంద్రపురం? నువ్వుకూడా మాయింటికో మాటు రావాలి, వారెవరు అచ్చమ్మపిన్నిగారా? మీరుకూడా లేవండి పిన్నిగారూ” అంటూ సీత వారిని రెక్కలు పట్టుకుని లేవతీసింది. కూతురూ అల్లుడూ సీతమ్మతో ముందు వెళ్ళగా అవతలి వీధికి వెళ్ళడం కనక రాజమ్మ లోపలి తలుపులన్నిగొళ్లెంవేసి వీధితలుపు తాళంవేసిలచ్చమ్మతో నింపాదిగా బయలుదేరింది.

రెండుగంట లయిందాకా అక్కడే సరిపోయింది. ఇక బాగుండదని సీతమ్మ నరసమ్మని దొడ్డిదానిని పంపేసి పదిమందిలోనూ వున్న రామాని కొసంగతి కళ్ళతో చెప్పింది. వెంటనే దగ్గర వున్న పరిచితుల సెలవు పొంది అతనుగూడా బయలుదేరాడు గాని వీధిలోకి వచ్చాటప్పటి కొక స్నేహితుడు కనపడి పదినిమిషాలు నుంచోపెట్టాడు. మరి పదిబారలు వచ్చాటప్పటి కిలాంటివాడే ఆవూరి అల్లు డొకడు తారసిల్లి పక్కాపావుగంట సేపాపేశాడు. మరికొంచెం ముందుకు వచ్చాటప్పటి కొక ముసలమ్మ ఇక్ష్వాకులనాటి మాటలు చెబుతూ అయిదునిమిషాలు ఏమిటేమిటో అడిగింది. అవిణ్ణీగూడా విడిపించుకుని మలుపుదాటాటప్పటికి „రామంబాబూ” అంటూ నరసమ్మ చెలికత్తె ఒకత్తె మూడునిమిషాలు కుశలప్రశ్నలు అడిగింది. ఆమెకు సమాధానాలు చెప్పి అత్తారి యిల్లు సమీపించగా యెదటి యింటి యజమాని కలుసుకుని వాళ్ళ అరుగుమీదకి తీసుకువెళ్ళి కూచోపెట్టి „గంగాబొండం తీయించనా?” అని „మజ్జిగతేట తెప్పించనా?” అని „కూజానీరు పట్టుకురానా?” అని „లైముజూసుకోసం పంపనా?” అని „పోనీ బంగినిపల్లిపం డొకటి కోయించనా?” అని అయిదునిమిషాలు విసిగించి విడిచిపెట్టాడు. ఇలాగ పదీపదిహేనూ యిరవైఅయిదూ, అయిదూ ముప్ఫయ్యీ, మూడూ ముప్ఫయిమూడూ, అయిదూ ముప్ఫయ్యీ

నిమిదిన్ని నడకకి మూడూ మొత్తం నలభైవొక్క నిమిషాలి కత నింటికి చేరుకున్నాడు.

„ఇంతసేపున్నావే?" మంది నరసమ్మ. „సీత మాతోటే పంపేస్తానని చెప్పిందే" అంది. ఆతను జరిగిందంతా చెప్పేడు. „వీధిలోకి వెడితే మళ్ళీ అనుకున్న నిమిషానికి రావడం సాధ్యమా?" అన్నాడు. ఏమంటే యేం? ఈమాటు అత నామెకి దొరికిపోయాడు. „మీ స్నేహాలె లాంటివో మా స్నేహాల లాంటివి కావు! మీరు మొగాళ్ళు కనక యెక్కడ కలుసుకున్నా కలుసుకుంటారు. మాకలాగా? నేను వాళ్ళ యిళ్ళకేనా వెళ్ళాలి. వాళ్లు మాయింటికేనా రావాలి. లేకలేక పొద్దున్నలాగ కలుసుకుంటే వాళ్ళూ విడవలేరు నేనూ విడవలేను. ఈమాటు బాగా తెలిసిందా? ఇంకెప్పుడూ యేమీ అనరుకదా" అని నరసమ్మ నుంచోపెట్టి చెప్పింది. రామం మందహాసం చేస్తూ మాట్లాడలేకపోయాడు.

మూడున్నరకి మళ్ళీ పూరీలూ, కాఫీ తయారైనాయి. నాలిగింటికి తాంబూలం. నాలుగుంబావుకి రాజమ్మ తలదువ్వడానికి కూర్చుని పిలుద్దామనుకుంటూ వుండగా పొద్దున్న వచ్చినవాళ్ళు కొందరూ, కొత్తవాళ్ళు కొందరూ చెలికత్తెలు మళ్ళీ వచ్చి లోపలికి సమను చేశారు. ఇక లాభం లేదనుకుని రామం బెత్తం పుచ్చుకొని ఇందాకా కనపడ్డ అపూరి అల్లుడుతనకికూడా యిలాగే తటస్థించి బయలుదేరిరాగా „మిమ్మల్ని పిలవడానికి బయలుదేరా" నంటే „మిమ్మల్ని వెలుద్దామనే వచ్చా" నని మాటలో మాట కలుపుకొని యిద్దరూ కలిసి షాలిమారుకేసి షికారు వెళ్ళిపోయారు.

౮

పొద్దు గూకింది. దీపాలు పెట్టారు. ఇప్పుడు నరసమ్మ సంగతి ఎలా వుందంటే? తలమీదా మెడలోనూ మల్లెపూవుల తెలుపూ, చేతులకి మంచిగంధం తెలుపూ, పాదాలికి పాంజేబుల తెలుపూ, వంటినిండా గ్లాస్గోమల్లు చీరా రవికల తెలుపూ, ముఖమ్మీద దంతకాంతిచేత ఉచ్చలితం అవుతూ వున్న మందహాసపు తెలుపూ, హృదయంలో బ్రహ్మానందపు తెలుపూనూ. ఈ తెలుపు అన్నీ కలిసి ఆమె పసుపుపచ్చని శరీరాని కొక చక్కని తళుకిచ్చాయి. మొత్తాని కామె చికిలీ చేసిన మన్మథబాణంలా వుంది.

దీపాలు పెట్టింది మొదలుకుని ఆమె రామం కోసం యెదురుతెన్నులు చూడడం మొదలుపెట్టింది. గబగబ వీధిగుమ్మంలోకి వస్తుంది. అక్కణ్ణుంచి మెల్లిగా వీధిఅరుగుమీదకి వచ్చి వీధిపొడుగునా యిటూ అటూ కూడా చూస్తుంది. పడకటింటోకి వెళ్ళి టేబిలైటు పెద్దదిచేసి మేజామీదవున్న అద్దానికెదురుగా నిలిచి ముంగురులూ, మెడలోని దండా సరిచేసికొని పక్కమాటు అనిమిషలోచనాలతో తన్ను తానే చూసుకుంటుంది. మళ్ళీ వీధిలోకి వస్తుంది. మళ్ళీ యింటోకి వెడుతుంది. మధ్యమధ్య వాకట్లో వున్న పడకకుర్చీమీద కూచుని చూపులు వీధిగుమ్మంలోనే వుంచి మెల్లిగా యేదో పాడుకుంటుంది. ఈ లోపుగా రాజమ్మ ఒకటిరెండుమాట్లు యిదంతా తలుపుసందులోనుంచి తొంగిచూసింది గాని నరసమ్మ కా సంగతి తెలవదు. ఇలాగ మూప్పావుగంటకి పైగా తిరిగింది. చివరిమాటు ఆమె వీధిగుమ్మంలోకి వచ్చాటప్పటికి రామం వచ్చాడు. సన్నని దీపపు వెలుగున ఆమె రంభలాగో వూర్వశిలాగో కనపడిం దతనికి. హృదయం అంతా ఒక్కమాటు సంతోషంతో గుబురున నిండిపోయింది. „ఇంతసేపున్నారేం?" అని యామె అడగ్గా „నీ చెలికత్తెలింత పెందరాడే నిన్ను విడిచిపెట్టారని నాకు కలవచ్చిందా యేమి?" టన్నాడతను.

„ఏంపులకం మాటలు చెబుతారండీ? కాకపోతేమాత్రం దీపాలు పెట్టేటప్పటికి యింటికి రాకూడదూ?"

„పొద్దుగూకేటప్పటికి నేను „లేవండీ, లేవండీ" అంటూ పోరుతూ లేచాను. గాని

„వుండండీ, వుండండీ” అంటూనే ఆయన అరగంట నిలిపేశాడు. తక్కిన అరగంటా పొలమూరుదగ్గిరనుంచి రావడానికి పట్టింది”

„బాగానే చేశారు. అక్కడ కచేరీ యిక్కడ షికారూనూ”

„అక్కడ వంటా యిక్కడ చెలికత్తెలూనూ”

„..............”

„మాట్లాడవేం! ఏదోమాట మీద వేసెయ్యి”

„నాకలాంటివి చేతగావు సుమండీ. గంటనుంచి కనిపెట్టుకుని వున్నాడు మానాన్న. పాపం తొమ్మిదింటికి తిన్న మెతుకులు”

„చేతగాదంటూనే అసాండం మీద వేసేశావు అయితే వడ్డించమను”

„స్నానం చెయ్యరా యేమిటి?”

„ఇంకా యిదోటి వుందా? ఇదిగో చెరువుకి వెళ్లొచ్చే క్షణం”

„చీకట్లో చెరువు కెందుకూ? రెండు గాబుల నీళ్ళు తోడాను రెక్కలు పడిపోయేలాగ”

„అన్ని నీళ్ళు తోడడానికి చెలికత్తెలు విడిచిపెట్టేరూ నిన్ను?”

„పాపం వాళ్ళే తోడిపెట్టారు సగానికి పైగానూ”

„అలా చెప్పు మరీ. ఇదిగో స్నానం అయిందన్నమాటే”

రాజమ్మ భర్తకీ అల్లుడికీ పడమటింటోనూ, కూతురికి నసారాలోనూ వడ్డించింది. ఈయేర్పాటు తల్లిదో కూతురిదో తెలవదు గాని స్థలం భేదించినా మధ్య వున్న గుమ్మం యిద్దరిచూపులూ కలుపుతూనే వుంది. ఏడుమ్ముప్పావయేటప్పటికి కొత్త ఆవకాయతోటీ, దొండకాయవేపడంతోటీ, వడియాలతోటీ, మిరాయాఅచారుతోటీ, బుడిగావుమీగడపెరుగుతోటీ, మామిడిపళ్లతోటీ, పనసతొనలతోటీ భోజనాలయినాయి. కూతురిచ్చిన తాంబూలం వేసుకుంటూ రాజమ్మ భోజనం చేసినంతసేపూ యెదట కూచుని సోమసుందరం ముందు సంగతి ఆలోచించాడు.

* * *

వీధిలో పల్లకీ దింపించి యింటిచాకలి పిలుద్దామని గుమ్మంయెక్కేటప్పటికి వాకట్లో వున్న బిగ్బెన్ సరిగ్గా నాలుగ్గంటలవేళ ఝామ్మని అయిదునిమిషాలవరకూ అలారం కొట్టింది. అందరూ లేచారు. దంతధావనాలూ, స్నానాలూ, అయేటప్పటికి రాజమ్మ చీరా, జామారూ తెచ్చింది. „ఇప్పుడెందుకూ?” అంటూనే భార్యాభర్తలిద్దరూ కట్టుకుని నమస్కారాలు చేశారు.

ఇలాగ ప్రయాణసన్నాహాలు జరుగుతూనే వున్నాయిగాని తల్లికీ కూతురికీగూడా మనస్సెలాగో వున్నాయి. తల్లికి „పంపా” లని వుంది. „వెడితే వుండడం యెలాగా” అని వుంది. కూతురికి „వెడితే అమ్మ కనపడదని వుంది” „వెళ్లకపోతే వారు కనపడ” రనివుంది. సోమసుందరం „యీ వారం అంతా సెలవుపెట్టమని చెబుదా” మనుకున్నాడు గాని అంత వుండలేకపోతే మళ్ళీ శనివారం వెళ్ళవచ్చునని వూరుకున్నాడు.

అయిదయింది. „బండి దొరక్కపోతే మమ్మల్నంటారు కామందుగా” రని ఇంటిచాకలనగా రామం „ఆలస్యం అవుతోందండీ. నేను ముందు వెడుతూ వుంటా” నని సూరిగాడిచేత మామిడిపళ్ళ తట్ట పట్టించుకుని బయలుదేరాడు. నరసమ్మకి రామంకూడా పల్లకీ యెక్కితే బాగుండునని వుంది గాని ఆమాట పైకి రావడం యెలాగ? వస్తేమాత్రం జరగడం యెలాగ?

విధిలేక మూడుమాట్లు తొందరపెట్టాడు

సోమసుందరం. తల్లీ కూతురూ కౌగిలించుకుని పల్లక్కీ దగ్గిరకి వచ్చారు. ఒకర్ని ఒకరు విడిచి పెట్టుకునేటప్పటికి అయిదు నిమిషాలయింది. నరసమ్మ గద్గదకంఠంతో తండ్రితో చెప్పాటప్పటికింకో రెండునిమిషాలూ, "అమ్మా" అని ఒక క్షణందాకా మాట రాకపోగా తల్లితో చెప్పడానికి మరి మూడునిమిషాలూ, అయింది. ఆమె పల్లక్కీలో కూచోడానికింకో రెండునిమిషాలు పట్టింది గాని బోయీలు వెంటనే పల్లక్కీ యెత్తి ఆలేటు కూడతీసుకున్నారు.

రాజమ్మ పదిబారలు కూడా వెళ్లి వెనక్కి మళ్ళి వాకట్లో వున్న బల్లమీద చదికిలపడింది. సోమసుందరం మురుగుకాలవదాకా సాగనంపి గరువుమీదికి వెళ్ళిపోయాడు. కొప్పవరం దగ్గిర నల్లకాలవదాటి బోదికాలవ గట్టుమీద కూచుని వున్నాడు రామం. అయిదునిమిషాలికి పల్లక్కీ కలుసుకుంది. దగ్గిరికి రాగానే నరసమ్మ పలకరించింది గాని తల్లిదండ్రుల్ని విడిచిరాలేని బెంగ ఆమె ముఖంమీద దట్టంగా వుండడం చూశాడతను. వెంటనే పల్లక్కీ పట్టుకుని బయలుదేరి "వూళ్ళోకి తహస్సీలుదారు వస్తే కరణం ఒక వేపునా మునసబు ఒక వేపునా యిలాగే పల్లక్కీ పట్టుకుని నడుస్తూ విన్నపాలు చేసుకుంటారు. నాకిప్పుడు నడవడం కష్టంగానే వున్నా యీసుఖం వల్ల అదంతా మరిచిపోయా" నన్నాడు. దానితో సూర్యరశ్మి తగిలాటప్పటికి తామరమొగ్గ అరవిచ్చినట్లు నరసమ్మ ముఖం వికసించింది. మరి పదిబారలు అలాంటిమాటలే చెబుతూ కూడా వెళ్లేటప్పటికి ఆమె మహేంద్రవాడని మరిచిపోయింది. భార్య సుఖమయకల్పనలో ప్రవేశించగానే రామం పల్లక్కీ విడిచి సూరిగాడితో కబుర్లు చెబుతూ వెనక్కాల వెళ్లాడు.

---

## స్మృతి

సీ. తమలపు టాన చిత్తమున రేకెత్తిన
కమ్మని బింబాధరమ్ము తోచు,
మిలమిలలాడు క్రొమ్మించు టద్దము గన్న
ముద్దు లూరించు నీబుగ్గ తోచు,
ఉండుండి పిల్లవాయువు సోక, నా మేన
లీనమైపోవు నీమేను తోచు,
అమరుకావ్యము విప్పినంతమాత్రమున పా
రము లేని నీవిలాసములు తోచు,

గీ. అన్నిటికి మీద నరసాక్షి-యున్న కనులు,
చిరుచెమట నంటియున్న ముంగురులు తోచి
అతిశయానంద పారవశ్యమ్ము కలుగు
లక్ష్మి! నాజీవితపురాజ్యలక్ష్మి వీవు.

కుమారకవిసింహుడు